నూతన సీసీ రోడ్లు మంజూరు చేయాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట్ డివిజన్‌లో పలు కాలనీలోని రోడ్లు పూర్తిగా దెబ్బతిని నడవలేని స్థితిలో ఉన్నాయని, వెంటనే సీసీ రోడ్లను మంజూరు చేయాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సోమవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ కలిసి వినతి పత్రం అందజేశారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ తానే స్వయంగా వచ్చి సమస్యను పరిశీలిస్తానని కార్పొరేటర్‌కు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బోనాల ఉత్సవాలకు ఆహ్వానం



దేప సురేఖా భాస్కర్‌రెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: బోనాల పండగ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం సరూర్‌నగర్ డివిజన్ (రామకృష్ణాపురం డివిజన్)లో ఉన్న పోచమ్మ, యల్లమ్మ, మైసమ్మ అమ్మవార్ల గుడి (మూడు గుళ్లు) వద్ద ఈనెల 31 నుంచి ఆగస్టు 3 వరకు రేణుకా ఎల్లమ్మ కల్యాణం, అమ్మవార్లకు బోనాలు సమర్పించడం, మైసమ్మ అమ్మవారి పలహార బండి ఊరేగింపు ఉత్సవాలకు హాజరుకావాలని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దేప సురేఖా భాస్కర్‌రెడ్డికి సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, ప్రధాన కార్యదర్శి బండి మధుసూదన్‌రావ్, ఉపాధ్యక్షులు గట్ల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలి



రాంచందర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

చాదర్‌ఘాట్: స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని సాధన కమిటీ రాష్ట్ర చైర్మన్ ఎండీ షఫీ అహ్మద్ ఖాన్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కమిటీ ప్రతినిధులతో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును కలిసి వినతి పత్రం సమర్పించారు. దివ్యాంగులకు స్థానిక సంస్థల్లో నామినేటెడ్ సభ్యులుగా అవకాశం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని వారు ఆయనను కోరారు. తమ వినతికి రాంచందర్‌రావు సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ దైనంపల్లి మల్లికార్జున్, తుడుం రాజేందర్, బాబురావు, మన్నె పోచయ్య, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మన్సూరాబాద్: తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా సమావేశం ఎల్బీనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోపికృష్ణ, కోశాధికారిగా రాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకట్‌రెడ్డి, కోమురయ్య, జాయింట్ సెక్రటరీలుగా శ్రీనివాస్, నర్సింహమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సత్యనారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మోహన్‌రెడ్డి, మధనాచారి, రమేష్‌రెడ్డి ఎన్నికైనట్లు నూతన అధ్యక్షుడు సోమిరెడ్డి తెలిపారు.

ఘనంగా పలహారం బండి ఊరేగింపు



పలహారం బండి ఊరేగింపులో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

నాగోలు: బోనాల పండుగ సందర్భంగా సోమవారం నాగోల్, సరూర్‌నగర్‌లో జరిగిన పలహారం బండి ఊరేగింపులో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అమ్మవార్ల ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంకర్, లోకేష్, రావుల రంజిత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. | ప్రయాణం సాగేదెలా?

- భారీ వర్షాలతో గుంతలమయంగా మారిన ఎల్బీనగర్ నియోజకవర్గంలోని రోడ్లు
- మరమ్మతులు మరిచిన సంబంధిత అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు

ఎల్బీనగర్: ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు కోతకు గురై అధ్వానంగా మారి గుంతలుగా ఉన్నాయి. వర్షం తగ్గినా గుంతలుగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయకుండా ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీలో ఉన్న ఇన్నర్ రోడ్లతో పాటు ప్రధాన రహదారులు కూడా గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. ఈ గుంతల రోడ్ల పైన వాహనాలు నడపాలంటే జేబులు గుల్లవుతున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ గుంతల్లో పడి వాహనాలు రిపేరుతో పాటు నడ్డి విరుగుతోందని పలువురు వాపోతున్నారు.

మరమ్మతుల పేరుతో ప్రజాధనం లూటీ..

గతంలో వేసిన రోడ్లు అధ్వానంగా మారడంతో పాటు ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు రోడ్లు అక్కడక్కడ కాలనీలో ధ్వంసమయ్యాయి. దీంతో ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతుల పేరుతో కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ప్రజాధనం లూటీ చేస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు రోడ్లను నాసిరకంగా కాకుండా నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు,

కోతకు గురైన రోడ్లు ఇవే..

- సరస్వతీనగర్ కాలనీలోని కమాన్ వద్ద రోడ్డు కోతకు గురైనా మరమ్మతులు చేయడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.
- కామినేని వైఎస్సార్ చౌరస్తా వద్ద గుంతలుగా మారిన రోడ్డు. ఇబ్బందుల్లో వాహనదారులు.
- శ్రీరాంనగర్ కాలనీలో కొట్టుకుపోయిన రోడ్డు. వాహనదారు ఇబ్బందులు పడుతున్నారు.
- మన్సూరాబాద్ గణేష్‌నగర్ రోడ్డు నెం-2లో గుంతలుగా మారిన రోడ్డు వాహనదారులు ఈ గుంతలతో జేబులకు చిల్లు పడుతున్నాయని గగ్గోలుపెడుతున్నారు.
- చింతలకుంట వద్ద రోడ్డు కోతకు గురికావడంతో రోడ్లపైకి వాహనాలు తేవాలంటే భయాందోళన చెందుతున్నారు
- బీఎన్‌రెడ్డినగర్‌లోని గాంధీనగర్ కాలనీలకు వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారడంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



సరస్వతీ నగర్ కాలనీలోని కమాన్ వద్ద భారీగా ఏర్పడిన గుంత



మన్సూరాబాద్‌లోని గణేష్‌నగర్ రోడ్డు నెం-2లో..



బీఎన్‌రెడ్డినగర్‌లోని గాంధీనగర్ కాలనీకి వెళ్లే రోడ్డు ఇలా..

మరమ్మతులు చేపట్టాలి..

కాలనీలకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలు పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. వర్షాలతో పాటు గతంలో రోడ్డు వేసిన కారణంగా మరమ్మతులు చేయకపోవడంతో రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– సురేష్, బీఎన్‌రెడ్డినగర్

సలీంనగర్ పార్కు 1 సమీపంలో..



మూసారంబాగ్‌లో..

మలక్‌పేట: మూసారంబాగ్‌లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. నాణ్యత కొరవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలమయం అయ్యాయి. పాడైన రోడ్లు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. డివిజన్ పరిధిలోని శాలివాహననగర్ మెయిన్‌రోడ్, సలీంనగర్ పార్కు-1 వద్ద, మలక్‌పేట ఆర్టీఏ ఆఫీసు పక్కన భారత్ పెట్రోల్ పంపు సమీపంలో వెళ్లే దారిలో ఈ దుస్థితి నెలకొంది. మరమ్మతులు చేపట్టిన మళ్లీ సమస్య పునరావృతం అవుతోంది. లక్షలు పోసి నిర్మించిన రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాడైన రోడ్ల మూలంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతర్గత రోడ్లు బాగు చేయడానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



మూసారంబాగ్ భారత్ పెట్రోల్ పంపు వద్ద..

వనస్థలిపురం డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

వనస్థలిపురం: కాలనీల్లో సమస్యలను దశలవారీగా పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని మల్లికార్జునానగర్ కాలనీలో రూ.40 లక్షల నిధులతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు, శ్రీనివాసపురం కాలనీలో రూ.3.5 లక్షలతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ విఘ్నేశ్వరి, కాలనీల సంక్షేమ సంఘం నాయకులు జంగం కృష్ణారెడ్డి, బడుగు శ్రీరాములు, జే.మురళీధర్, బాలచందర్, హరిందర్‌రెడ్డి, సాయికిరణ్, ప్రేమ్‌కుమార్, నిరంజన్, షరీఫ్, సాయిచరణ్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

బస్తీవాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మలక్‌పేట: బస్తీవాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని తెలంగాణ దళిత గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బట్టుదాసురావు, ప్రధాన కార్యదర్శి కొర్ర చందులాల్ నాయక్ ప్రభుత్వానికి కోరారు. 30 ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం నగరానికి వచ్చి తీగలగూడ బంజారాబస్తీ గుడిసెల్లో నివాసం ఉంటున్న బీసీ, మైనార్టీ, దళిత, గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరుతూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్, ఆర్డీవో, సైదాబాద్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. సోమవారం మూసారంబాగ్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ..2021లో సైదాబాద్ మండల అధికారులు సోషియో ఎకానమిక్ సర్వే నిర్వహించారని, అయినా 150 కుటుంబాలకు సొంతింటి కల నెరవేరలేదన్నారు. పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలకు విన్నవించామని తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలు అన్నింటిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల న్యూ సుబ్రహ్మణ్యనగర కాలనీలో పర్యటించిన సమయంలో కాలనీలో బోరు ఏర్పాటు ఆవశ్యకత గురించి స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వెంటనే అధికారులతో చర్చించి కాలనీలో కొత్త బోర్‌వెల్‌ను మంజూరు చేయించామని తెలిపారు. సోమవారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది, కాలనీవాసులతో కలిసి బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..డివిజన్‌లో ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే స్థానికులు తన దృష్టికి తీసుకు రావాలని వెంటనే అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారిణి శిరీష, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు యాదయ్యగౌడ్, సంగారెడ్డి, గోపాల్, శివరాజ్ పాల్గొన్నారు.



బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

'హైవేలపై వాహనాలు పార్కు చేయొద్దు'



డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ మహేష్

హస్తినాపురం: జాతీయ రహదారులపై వాహనాలను పార్కు చేస్తే చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ మహేష్ హెచ్చరించారు. జాతీయ రహదారి ఆటోనగర్ వద్ద అజాగ్రత్తగా పార్కు చేసిన 12 మంది లారీ డ్రైవర్లపై కేసులు నమోదు చేసి వారికి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..జాతీయ రహదారిపై వాహనాలను పార్క్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. వాహనాల డ్రైవర్లు తమ వాహనాలను పార్కింగ్ స్థలంలో పార్కు చేసుకోని ప్రమాదాలు తగ్గుతాయని సూచించారు.

ప్రభుత్వాలు మారినా సంక్షేమం ఆగకూడదు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: ప్రభుత్వాలు మారిన సంక్షేమం ఆగకూడదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం బాలాపూర్ మండల కార్యాలయం ఆధ్వర్యంలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బడంగ్‌పేట్‌లోని ప్రజాభవన్ ఫంక్షన్‌హాలులో చేపట్టారు. కార్పొరేషన్‌లో 1003, జల్‌పల్లి మున్సిపాలిటీలో 319 కలిపి మొత్తంగా 1,322 కార్డులు మంజూరు కాగా.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి హాజరై లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వాలు మారినా అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించే బాధ్యత ఉంటుందన్నారు.

రేషన్‌కార్డులు ఇచ్చి చూపించాం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతీ పేదవారికి రేషన్‌కార్డులు ఇస్తామన్నా మాట నిలబెట్టుకున్నామని టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్ల నర్సింహారెడ్డి అన్నారు. అర్హులు ఎవరైనా మిగిలి ఉంటే న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, కమిషనర్ పి.సరస్వతి, తహసీల్దార్ ఇందిరాదేవి, నయాబ్ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నవారు మల్లారెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమోటా రూ.43, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.60, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.41, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.43, దోసకాయ రూ.13, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.25, మునగ రూ.28, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.28, కీర రూ.35, బీన్స్ రూ.60, క్యాప్సికమ్ రూ.55.

ఈరోజు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

శ్రీలతారెడ్డికి డాక్టరేట్



శ్రీలతారెడ్డి

ఎల్బీనగర్: ఎల్బీనగర్‌కు చెందిన శ్రీలతారెడ్డి ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్‌లో వీఎల్‌ఎస్ఐ ఆధారిత ద్విమితీయ పినైట్ ఇంపల్స్ రెస్పాన్స్ పిల్టర్ శిల్ప నిర్మాణం, పనితీరు విశ్లేషణ అనే పరిశోధన చేశారు. ఇందుకు గాను చెన్నైలోని ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఆమె (పీహెచ్‌డీ) డాక్టరేట్‌ను తీసుకున్నారు. చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమెకు ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. శ్రీలతారెడ్డి ప్రస్తుతం బీఎన్‌రెడ్డి సమీపంలోని సీవీఆర్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



మౌనిక

హయత్‌నగర్: మహిళ అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..ఇరుగు మౌనిక(25) భర్త రాజుతో మనస్పర్థలు రావడంతో కొంత కాలంగా అతనికి దూరంగా ఉంటూ పెద్ద అంబర్‌పేట లక్ష్మారెడ్డిపాలెంలో ఉండే తన తల్లి పత్తెపురం మీనమ్మ దగ్గర ఉంటుంది. ఆదివారం ఉదయం బయటికి వెళ్లి వస్తానని వెళ్లిన మౌనిక సాయంత్రం వరకు తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆందోళనకు గురైన తల్లి చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని వినతి



బడంగ్‌పేట్: మున్సిపల్‌లో కార్పొరేటర్ల పదవీ కాలం దాటి ఆరునెలలు గడిచినా ఇంకా కార్లపై వారి పేరుతో ఉన్న నంబర్ ప్లేట్లను అలాగే ఉంచారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న అలాంటి వాటిని గుర్తించి తొలగించాలని కోరుతూ.. సోమవారం మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్ కమిషనర్ సరస్వతికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్లకు ఉన్న కార్పొరేటర్ అనే నంబర్ ప్లేట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని డివిజన్ల కార్పొరేటర్లపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, సామ వరుణ్‌రెడ్డి, సరసమ్మ, భాస్కర్, వెంకటేశ్, శివ, నర్సింగ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

బస్తీ దవాఖానాలో మెరుగైన వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ అరుణారవీందర్‌రెడ్డి

సైదాబాద్: బస్తీ దవాఖానాకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి వైద్య అధికారులకు సూచించారు. సోమవారం ఆమె జాకీర్ హుస్సేన్ కాలనీలోని బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన దవాఖానా అభివృద్ధి కమిటీ సమావేశంలో వైద్య విభాగం అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బస్తీ దవాఖానలకు వచ్చే రోగులు వారి బంధువులతో మర్యాదగా నడుచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డివిజన్ ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండేలా వైద్యాధికారులు తగిన సూచనలు ఇవ్వాలని అన్నారు. ఎంటామాలజీ విభాగం అధికారులు తమ సిబ్బందితో కాలనీలు, బస్తీల్లో తరచూ ఫాగింగ్ చేయించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ బ్రిజునీసా, డాక్టర్ రవికాంత్, డాక్టర్ తరుణి, డాక్టర్ ఫాతిమ, మలేరియా డిపార్ట్‌మెంట్ అధికారి మల్లికార్జున్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, ఎంటమాలజీ అధికారి మల్లికార్జున్, ఆశా వర్కర్లు అరుణ, ఆశా, సంధ్య, పుష్ప పాల్గొన్నారు.

చిన్న చెరువు గేట్ వాల్వ్‌కు మరమ్మతులు



రామంతాపూర్: డివిజన్ పరిధిలోని చిన్న చెరువు కట్ట తూము వద్ద గేట్‌వాల్వ్ ఐరన్ షీట్ తుప్పు పట్టడంతో చెరువులోని నీరు లీకై పారుతోందని స్థానికులు సోమవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావుకు ఫిర్యాదు చేశారు. సానుకూలంగా స్పందించిన ఆమె అధికారులకు సమాచారం ఇచ్చి హైడ్రా యంత్రాలతో గేట్ వాల్వ్‌కు మరమ్మతులు చేయించి పునరుద్ధరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం చిన్న చెరువు ఇటీవల కురిసిన వర్షాలతో పూర్తిగా నిండుకుందని, ఈ నేపథ్యంలో హైడ్రా డీఆర్‌ఎఫ్ టీమ్‌లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఏ చిన్న లీకేజీ ఏర్పడినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎడ్యుకేషన్ డీఈ శక్లజ్, ఏఈ సుధీర్, డీఆర్‌ఎఫ్ హైడ్రా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో నాలుగు ఫిర్యాదులు



ప్రజావాణి కార్యక్రమంలో డీసీ, ఇతర అధికారులు

ఎల్బీనగర్: ఎల్బీనగర్ జోన్ పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయాలు, ఒక జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రజావాణికి నాలుగు ఫిర్యాదులు మాత్రమే వచ్చాయని అధికారులు తెలిపారు. కాప్రా సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్ విభాగంపై ఒక ఫిర్యాదు. ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలపై ఒక్కొక్క ఫిర్యాదు. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్ విభాగంపై ఒక్క ఫిర్యాదు వచ్చినట్లు పేర్కొన్నారు. సరూర్‌నగర్ సర్కిల్, ఎల్బీనగర్ సర్కిల్, ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో ప్రజావాణికి ఒక్క ఫిర్యాదు కూడా దాఖలు కాలేదు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



డీఈఈ వెంకన్నతో కలిసి రోడ్డును పరిశీలిస్తున్న పారిజాత

బడంగ్‌పేట్: బాలాపూర్–బడంగ్‌పేట్ ఆర్‌సీఐ ప్రధాన రహదారి అధ్వానంగా మారిందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని మాజీ మేయర్ చిగురింత పారిజాత డీఈఈ వెంకన్నను కోరారు. సోమవారం 31వ డివిజన్‌లోని లక్ష్మీనగర్, శాంతినగర్ కాలనీల్లో ఆమె పర్యటించారు. డీఈఈతో కలిసి బడంగ్‌పేట్ టూ బాలాపూర్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీల్లో నెలకొన్న రోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరించాలన్నారు. అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఈ హరీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, వార్డు ఆఫీసర్లు శ్రీకాంత్, శ్రీనివాస్‌గుప్తా, గిరి ముదిరాజ్, శివకుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

మాజీ మేయర్ చిగురింత పారిజాత

బడంగ్‌పేట్: నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మాజీ మేయర్ చిగురింత పారిజాత అన్నారు. ఆహార భద్రతకార్డుల(రేషన్ కార్డులు) ప్రక్రియ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గత 12 సంవత్సరాలల్లో ఎన్నడూ లేని విధంగా మొదటిసారి పెద్దఎత్తున రేషన్‌కార్డుల పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని అందిస్తూ ప్రజల్లో సంతోషాన్ని నింపిందన్నారు. ప్రజాసంక్షేమానికి సీఎంరేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.